అరియలూరు దుర్ఘటనకు 69 యేళ్లు

ప్రమాదంలో ధ్వంసమైన బోగీలు (ఫైల్‌ఫొటో)



● ఆదమరచి నిద్రపోతున్న 250 మంది జలసమాధి
● లాల్ బహదూర్ శాస్త్రి రాజీనామాకు కారణమైన రైలు ప్రమాదం

ఆ ప్రమాదం జరగటానికి ముందురోజు రాత్రి 9.30 గంటలకు చెన్నై ఎగ్మోర్ నుండి తూత్తుకుడికి ఎక్స్‌ప్రెస్ రైలు (నెం 603) సుమారు 800 మంది ప్రయాణికులతో బయలుదేరింది. స్టీమ్ ఇంజన్‌తో ఉన్న రైలు.. మొత్తం 13 బోగీలతో కుండపోత వర్షంలోనూ దట్టమైన పొగలు కక్కుకుంటూ పరుగులు పెడుతోంది. రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణికులంతా ఆదమరచి నిద్రపోతున్నారు. అన్ రిజర్వుడు బోగీలు, లేడీస్ కంపార్ట్‌మెంట్లలో వారు మాత్రం కునికిపాట్లు పడుతున్నారు. అర్ధరాత్రి సమయంలో ఆ రైలు విరుదాచలం రైల్వేస్టేషన్ చేరింది. జడివానలో ఆ స్టేషన్ వద్ద రైలు పావుగంటకు పైగా ఆగింది. స్టేషన్ సిబ్బంది ఆ రైలు చివరి బోగీని సేలం వెళ్లే లింక్ ఎక్స్‌ప్రెస్‌కు తగిలించేందుకు విడగొట్టారు. అనంతరం 12 బోగీలతో ఆ రైలు తూత్తుకుడి దిశగా బయలుదేరింది. మధ్యలో ప్రయాణీకులు ఎక్కుతున్నా, దిగుతున్నా ఎక్కడా కుండపోత వర్షం మాత్రం తగ్గలేదు.

ఊగిన రైల్వే వంతెన...

వేకువజామున 5.30 గంటలకు ఆ రైలు అరియలూరు దాటి తిరుచ్చి వైపు పరుగులు తీసింది. భారీ వర్షాలతో కావేరి నదికి ఉపనదిగా ఉన్న 'మరుదయారు' వాగు రైల్వే వంతెన మీదుగా వరదనీరు ప్రవహిస్తోంది. అంతటి ప్రమాదకరమైన స్థితిలో ఉన్న ఆ వంతెనపై ఎలాంటి వెలుతురు లేదు. రైలు డ్రైవర్ దురైస్వామి, ఫైర్‌మన్‌లు (బొగ్గు కాల్చేవారు) మునుసామి, కోదండన్ లకు ఆ వంతెనపై వున్న వరదనీరు కనిపించలేదు. అప్పటికే మరుదయారు వాగు వరద తాకిడికి రైల్వే వంతెన స్తంభాలు చాల వరకు దెబ్బతిని ఏ క్షణంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. రైలింజన్ చక్రాలు తాకింది మొదలు స్తంభాలు నీటిలో కూలిపోయాయి. క్షణాల్లో బోగీలు వాగు వరదనీటిలో మునిగిపోయాయి, మరికొన్ని నీటి వేగానికి కొట్టుకుపోయాయి. నిద్రలో వున్నవారిలో చాలామంది ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి. ఇంజిన్ తరువాత వున్న ఏడు బోగీలు జలసమాధి అయ్యాయి. రైలింజన్ వెనుకనున్న లేడీస్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణించిన మహిళలు, బాలబాలికలు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ప్రమాదంలో 250 మంది ప్రయాణికులు జల సమాధి అయ్యారు. సూర్యోదయానికి కొన్ని నిమిషాల ముందే ఈ ప్రమాదం గురించిన సమాచారం రైల్వే శాఖ ఉన్నతాధికారులకు అందింది. రైల్వే అధికారులు, కార్మికులు, ఇంజనీరింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలను ప్రారంభించారు.

అత్యంత భయానకం...

అరియలూరు రైలు ప్రమాదం గురించి మరుదయారు వాగు సమీపంలోని రామలింగాపురం గ్రామానికి చెందిన రామచంద్రన్ (85) వివరిస్తూ... ఆ దుర్ఘటన జరిగినప్పుడు తనకు 17 యేళ్లు అని, వేకువజామున బాంబు పేలుడు లాంటి శబ్దం వినిపించడంతో ఊళ్లో ఏదో భవనం కూలి ఉంటుందన్న అనుమానంతో కాగడాలు పట్టుకుని ఊరంతా తిరిగామని తెలిపారు. అయితే ఎక్కడా ఎలాంటి ఇళ్లు కూలినట్లు కనిపించలేదన్నారు. మరికొద్దిసేపటికే రైలు ప్రమాదం గురించి తెలిసి, అక్కడకు పరుగులు పెట్టామని గుర్తు చేసుకున్నారు. కానీ సగం రైలు పెట్టెలు నీటిలో కొట్టుకుపోగా, అక్కడంతా ఏడ్పులు పెడబొబ్బలతో పరిస్థితి భయానంగా కనిపించిందన్నారు.. అలాంటి బీభత్స దృశ్యాన్ని తానెప్పుడూ చూడలేదని, ఆ దృశ్యాలను గుర్తు చేసుకుంటే ఇప్పటికీ వణకుపుడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

23 నవంబరు 1956...
250 మందిని జలసమాధి చేసిన రోజు.. యావత్ తమిళనాడును దుఃఖసాగరంలో ముంచేసి, దేశాన్ని కుదిపేసిన రోజు.. ఏకంగా రైల్వేశాఖ మంత్రి రాజీనామాకు దారి తీసిన ఈ ఘటన జరిగి 69 ఏళ్లయింది. పాలనాదక్షుడిగా నిజాయతీపరుడిగా పేరున్న లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రి పదవి రాజీనామాకు కారణమైంది.
- (చెన్నై, ఆంధ్రజ్యోతి)



అప్పటి రైల్వేశాఖ మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి

రెండు రోజుల తర్వాతే మృతదేహాల వెలికితీత...

రైల్వే కార్మికులు, ఇంజనీరింగ్ నిపుణులు రెండు రోజులపాటు జరిపిన తీవ్ర గాలింపుచర్యల తర్వాతే 150 మంది మృతదేహాలను వెలికి తీశారు. ఆ మృతదేహాలన్నీ గుర్తుపట్టలేనంతగా కుళ్లిపోయాయి. కొన్ని బోగీలు భూమిలోపలే కూరుకుపోవటంతో వాటిని వెలికి తీయలేకపోయారు. కొన్నాళ్లకు వాగులోని నీరు ఇంకిపోయాక అక్కడే ఆ బోగీలను కాల్చివేశారు. దేశవ్యాప్తంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించిన ఈ దుర్ఘటన జరిగినప్పుడు నెహ్రూ ప్రధాని, రైల్వే శాఖ మంత్రిగా ఉన్న లాల్ బహదూర్‌శాస్త్రి అరియలూరు రైలు ప్రమాదం గురించి తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ ప్రమాదానికి బాధ్యత వహిస్తూ లాల్ బహదూర్ శాస్త్రి మంత్రి పదవికి రాజీనామా చేసి చరిత్రలో ఆదర్శనేతగా నిలిచారు. అప్పట్లో తమిళనాడుకు చెందిన అళగేశన్ రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్నారు. ఈ దుర్ఘటన జరిగి నేటితో 69 యేళ్లు పూర్తయినా ఆ ప్రమాదం సృష్టించిన చేదు అనుభవాలు ఇంకా తమిళనాడు ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. ఆ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన కొందరు చిన్నారులు ఇంకా బ్రతికే ఉన్నారని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

అశువులు బాసిన అక్షరయోధుడు

● తమిళ సాహితీవేత్త ఈరోడ్ తమిళన్బన్ కన్నుమూత
● సీఎం స్టాలిన్ సహా పలువురు ప్రముఖుల సంతాపం



తమిళన్బన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సాహితీవేత్త, రచయిత, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, మద్రాసు దూరదర్శన్ మాజీ న్యూస్ రీడర్ ఈరోడ్ తమిళన్బన్ (92) శనివారం ఉదయం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా ఆయన శ్వాసకోశ సమస్యలతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చికిత్స ఫలించక మృతి చెందారు. ఈరోడ్ జిల్లా చెన్నిమలైలో ఎస్ఆర్ నటరాజన్, వళ్ళియమ్మాళ్ దంపతులకు 1933 సెప్టెంబర్ 28న తమిళన్బన్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎన్.జగదీశన్. చెన్నిమలైలో ప్రాథమిక విద్యాభ్యాసం తర్వాత అన్నామలై విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యనభ్యసించారు. మద్రాసు యూనివర్శిటీలో తమిళభాషలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 'తనిపాడల్ తిరుట్టు ఓర్ ఆయ్వు' అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ సాధించారు. తొలుత ఈరోడ్‌లోని మదర్సా ఇస్లామియా ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1972లో శాంతకుమారిని వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు 'పాప్‌లో నెరుదా', భారతిదాసన్ అనే ఇద్దరు కుమారులున్నారు. పీజీ, పీహెచ్‌డీ తర్వాత ఆయన రాయపేట న్యూకాలేజీలో తమిళ ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత మద్రాసు దూరదర్శన్‌లో తమిళ న్యూస్ రీడర్‌గా పనిచేశారు. ఉచ్ఛారణ దోషాలు లేకుండా చక్కటి తమిళంలో ఆయన చదివే వార్తలు అప్పటి దూరదర్శన్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేవి. కొంతకాలం ఆయన తమిళనాడు ఇయల్ ఇసై నాటకమండ్రం నిర్వహణ కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక తమిళ సంఘం సభ్యుడిగా సేవలందించారు. తమిళ సినీ దర్శకుడు కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అచ్చమిల్లై అచ్చమిల్లై' హరిహరన్ దర్శకత్వం వహించిన 'నీయుమ్ నానుమ్' అనే చిత్రాలకు పాటలు కూడా రచించారు. 'వసందత్తిల్ ఒరు వానవిల్' మూవీకి అసోసియేట్ దర్శకుడిగా, మాటల రచయితగా పనిచేశారు. తమిళన్బన్ పాఠశాల విద్యార్థి దశలోనే 'సుయ సిందనై' అనే పేరుతో చేతి రాత పత్రిక నడిపారు. మొట్టమొదటి కవితా సంకలనం 1968లో 'కొడికాత్తకుమరన్ విల్లుపాట్టు' వెలువరించారు. 'విడివెళ్ళి', 'మలైమాన్' అనే కలం పేర్లతో రచనలు చేసిన తర్వాత 'తమిళన్బన్' అనే కలం పేరు స్థిరపరచుకున్నారు. ప్రముఖ తమిళ కవి భారతదాసన్‌తో (1954 నుండి 1964 వరకు) పదేళ్లపాటు సన్నిహితంగా వున్నారు. భారతిదాసన్ ప్రోద్బలంతోనే 1965లో 'నెంజిన్ నిళల్‌గళ్' నవల రాయగా, దానిని చెన్నైలోని ప్యారీ ప్రెస్ ముద్రించి వెలువరించింది. ఆ తరువాత 'హైకూ' 'సెన్ర్యూ' వంటి జపనీస్ కవితా రూపాల్లో తమిళంలో దిపదల్లాంటి కవితా సంకలనాన్ని కూడా ప్రచురించారు. 'వణక్కమ్ వళ్లువా' అనే రచనకుగాను ఆయనకు సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈరోడ్ తమిళన్బన్ సుదీర్ఘకాల సాహిత్య సేవలకుగాను 1973 నుండి 2017 వరకూ ఎన్నో అవార్డులు, నగదు పురస్కారాలను అందుకున్నారు. వీటిలో భారతిదాసన్ అవార్డు (1991), మురసొలి ట్రస్ట్ 'కలైంజర్ అవార్డు (1998), ప్రభుత్వ 'కలైమామణి' అవార్డు (1999), పెరియార్ అవార్డు (2005), కవిక్కో అవార్డు (2011), దినతంది పత్రిక నుంచి జీవనసాఫల్య పురస్కారం ఉన్నాయి. కాగా తమిళన్బన్ మృతి పట్ల సీఎం స్టాలిన్ తన ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.

పొత్తులపై చర్చలకు ప్రత్యేక కమిటీ

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై



ప్యారీస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులపై చర్చించేందుకు ఐదుగురితో కూడిన కమిటీని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించిందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్యే సెల్వపెరుంతగై పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. తమిళనాడులో ఎన్నికల పొత్తుపై మిత్రపక్షాలతో చర్చల్లో పాల్గొనేందుకు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి గిరీష్ చోడంగర్ అధ్యక్షతన ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటైనట్టు తెలిపారు. ఈ కమిటీలో ఏఐసీసీ కార్యదర్శులు సూరజ్ ఎంఎన్ హెగ్డే, నివేదిత్ ఆళ్వా, తమిళనాడు అసెంబ్లీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ఎస్.రాజేష్‌కుమార్‌తో పాటు తాను కూడా ఉంటానని సెల్వపెరుంతగై తెలిపారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లాగే రాబోయే ఎన్నికల్లో కూడా డీఎంకే నేతృత్వంలోని కూటమి తరుపున పోటీ చేస్తామని, ఏఏ నియోజకవర్గాలన్న వివరాలు పార్టీ అధిష్ఠానం అధికార పూర్వకంగా వెల్లడిస్తుందని ఆయన పేర్కొన్నారు.

కోవై, మదురై మెట్రోలకు అనుమతివ్వండి

● మీతో భేటీకి అవకాశం కల్పించండి ● ప్రధానికి సీఎం వినతి

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత మాంచెస్టర్ నగరం కోయంబత్తూరు, ఆలయాల నగరం మదురైలో మెట్రోరైలు ప్రాజెక్టు పనులకు ఆమోదం తెలుపకపోవడం గర్హనీయమని, ఈ రెండు ప్రాజెక్టుల నివేదికలను పునఃపరిశీలించి వీలైనంత త్వరగా అనుమతివ్వాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మరోమారు ప్రధానిని కలుసుకుని చర్చించేందుకు తాను సిద్ధమని, ఆ మేరకు అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ మేరకు శనివారం ప్రధాని మోదీకి సీఎం లేఖ రాశారు. ఈ రెండు నగరాలలో మెట్రోరైలు ప్రాజెక్టులను అమలు చేయడానికి చర్యలు తీసుకునేలా కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఆదేశాలవ్వాలని కోరారు. కోయంబత్తూరు, మదురై నగరాలలో మెట్రోరైలు ప్రాజెక్టులను ఆమోదించకుండా తిరస్కరించడంతో అక్కడి ప్రజలే కాకుండా రాష్ట్ర ప్రజలంతా తీవ్ర నిరాశకు గురవుతున్నారని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా ప్రైవేటు వాహనాలు కలిగిన తమిళనాట మెరుగైన రవాణా సదుపాయాలను కల్పించేందుకే రెండు నగరాలలో మెట్రో రైలు ప్రాజెక్టును అమలు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ రెండు మెట్రోరైలు ప్రాజెక్టులకు అనుమతి, భారీగా నిధులు మంజూరు చేయాలని మే 24న, జూలై 26న ఢిల్లీలో ప్రధాని మోదీని స్వయంగా కలుసుకుని వినతిపత్రాలను అందజేసిన విషయాన్ని ఆ లేఖలో గుర్తు చేశారు. అన్ని సదుపాయాలు మెండుగా ఉన్న కోయంబత్తూరు, మదురై నగరాలకు అనుమతి నిరాకరించడం గర్హనీయమని తెలిపారు. కోయంబత్తూరు, మదురై నగరాలలో 20 లక్షల కంటే తక్కువ జనాభా కలిగి ఉన్నాయనే ఆరోపణలు నిజం కావని, ఆ రెండు నగరాలలో జనాభా 20లక్షలు దాటిపోయిందని తెలిపారు. రాష్ట్రంలో ఈ రెండు మెట్రోరైలు ప్రాజెక్టులకు స్థల సేకరణలో ఎలాంటి అడ్డంకులు లేవని, ప్రాజెక్టులకు ఇచ్చేందుకు స్థల యజమానులు కూడా సిద్ధంగా ఉన్నారని వివరించారు. అవసరమైతే ఈ ప్రాజెక్టులపై మరిన్ని వివరాలను అందించడానికి సంబంధిత అధికారులతో వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని స్టాలిన్ పేర్కొన్నారు.



సీఎంతో మంత్రి అన్బిల్ మహేష్, ఎంపీ విల్సన్

ఉపాధ్యాయులకు అండ

ఉపాధ్యాయులను ద్రావిడ మోడల్ ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్టాలిన్ హామీ ఇచ్చారు. అన్నా అరివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, డీఎంకే ఎంపీ, న్యాయవాది విల్సన్ శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, 2011వ సంవత్సరానికి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులై ఉండాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై చర్చించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో ఉపాధ్యాయుల్లో నెలకొన్న భయాందోళనలు నివృత్తి చేసేలా శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించినట్లు మంత్రి అన్బిల్ మహేష్ సీఎంకు వివరించారు.

25, 26 తేదీల్లో కోవై, ఈరోడ్‌లో సీఎం స్టాలిన్ పర్యటన

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 25న కోయంబత్తూర్, 26న ఈరోడ్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... 25వ తేది ఉదయం కోవైలో సెమ్మొళి పార్క్‌ను సీఎం ప్రారంభించనున్నారు. సాయంత్రం పరిశ్రమల శాఖ తరపున వివిధ పారిశ్రామిక సంస్థలతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. 26వ తేది ఉదయం ఈరోడ్ జిల్లా మొడకుర్చి జయరాంపురంలో పోలన్ విగ్రహంతో కూడిన హాలును సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం చిన్నమలై మణి మండపానికి వెళ్లి ఆయన విగ్రహానికి నివాళులర్పించనున్నారు. కొత్త బస్టాండ్ సమీపంలో జరిగే కార్యక్రమంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు.

ఆవిన్ ప్యాకెట్ల పై 'సర్' ప్రచారం

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఈ నెల 4న ప్రారంభమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. ఆ మేరకు ఆవిన్ సంస్థ రోజూ సరఫరా చేస్తున్న పాలప్యాకెట్లపై 'సర్'కు సంబంధించిన ప్రకటనలు ముద్రించింది. ఆ ప్రకటనలో ఎన్నికల సిబ్బంది పంపిణీ చేసిన ప్రత్యేక సమగ్ర సవరణలకు సంబంధించిన దరఖాస్తులను పూర్తిచేసి స్థానిక బీఎల్వోకు అందజేశారా? అంటూ పచ్చ రంగులో తమిళంలో ముద్రించి ఉంది. ఆవిన్ పాలప్యాకెట్లపై ముద్రించిన ఈ ప్రకటన ఓటర్లలో మంచి మార్పు తీసుకురావటం ఖాయమని ఆవిన్ సంస్థ అధికారులు పేర్కొన్నారు.



ఆవిన్ పాలప్యాకెట్‌పై 'సర్'కు మద్దతుగా ముద్రించిన ప్రకటన

సేలంలో డీఎంకే నేత హత్య



రాజేంద్రన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఆత్తూరులో జరిగిన భూ తగాదాల్లో డీఎంకే స్థానిక నాయకుడు రాజేంద్రన్ దారుణ హత్యకు గురయ్యారు. సేలం జిల్లా కల్వరాయన్‌మలై కరియకోవిల్ పోలీసుస్టేషన్ పరధిలోని కిరాంకాడు గ్రామానికి చెందిన రాజేంద్రన్ (45) డీఎంకే స్థానిక కార్యదర్శిగా ఉన్నారు. ఆయనకు రాజమాణిక్కం అనే మరో వ్యక్తి మధ్య గత కొంతకాలంగా భూ తగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. ఆ సందర్భంగా రాజమాణిక్కం తన నాటు తుపాకీతో రాజేంద్రన్ వైపు కాల్పులు జరిపి పారిపోయాడు. ఆ కాల్పుల్లో రాజేంద్రన్ మరణించాడు. ఈ సంఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రాజేంద్రన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

అడయార్‌లో రౌడీ అరెస్టు

● ఇద్దరు సహచరుల నిర్బంధం

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూరు విశాలాక్షి గార్డెన్ ప్రాంతానికి చెందిన రౌడీ మౌళి (24)ని పట్టపగలు హతమార్చి పరారైన మరో రౌడీషీటర్‌ను కాల్పులు జరిపి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన అడయార్ ఇందిరానగర్ ఎంఆర్‌టీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం వేకువజామున జరిగింది. విశాలాక్షి గార్డెన్ ప్రాంతంలో మౌళి, విజయకుమార్ అనే ఇద్దరు రౌడీలు ఆధిపత్యం కోసం తరచూ ఘర్షణ పడుతుండేవారు. ఆ ప్రాంతంలో రౌడీ మౌళికి మాత్రమే స్థానికులు భయపడుతుండటం గమనించిన విజయకుమార్ అతడిని హతమార్చి తాను ఆ ప్రాంతంలో రౌడీగా చెలామణీ కావాలని నిర్ణయించుకున్నాడు. ఆ మేరకు గురువారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో రౌడీ మౌళిని చుట్టుముట్టిన విజయకుమార్, అతడి అనుచరులు నింజన్, గౌతమ్ వేటకొడవళ్లతో దారుణంగా హత్య చేసి పారిపోయారు. రాజా అన్నామలైపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని ఈ హత్య కేసుతో సంబంధం ఉన్న నిరంజన్, గౌతమ్‌లను శుక్రవారం అరెస్టు చేశారు. ఆ తర్వాత రౌడీ విజయకుమార్ ఆచూకీ కోసం గాలించారు. ఈ నేపథ్యంలో విజయకుమార్ అడయార్ ఇందిరానగర్ ఎంఆర్‌టీఎస్ రైల్వేస్టేషన్ పొదలమాటున దాగి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ అంబేడ్కర్ సిబ్బందితో వేకువజామును ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. పోలీసులను చూడగానే విజయకుమార్ వేటకొడవళ్లతో దాడికి దిగడంతో హెడ్‌కానిస్టేబుల్ తమిళరసన్ తీవ్రంగా గాయపడ్డాడు. దీనితో సీఐ అంబేడ్కర్ తుపాకీతో రౌడీ కాళ్లపై కాల్పులు జరిపి, అతడిని అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించారు. రౌడీ దాడిలో తీవ్రంగా గాయపడిన హెడ్‌కానిస్టేబుల్ తమిళరసన్‌ను చికిత్స కోసం రాయపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



పోలీసుల కాల్పుల్లో గాయపడ్డ రౌడీ విజయకుమార్




రౌడీ అనుచరులు నిరంజన్, గౌతమ్

సమాచార దృశ్యం

5న విద్యాధికారుల సమావేశం

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ప్రతి నెలా 5వ తేది ప్రధాన విద్యాధికారుల సమావేశం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి నిర్ణయించారు. ఈ విషయమై జిల్లా ప్రధాన విద్యాధికారులకు పాఠశాల విద్య డైరెక్టర్ కన్నప్పన్ పంపిన సర్క్యులర్‌లో వివరాలిలా ఉన్నాయి... పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి నేతృత్వంలో ప్రతినెలా 5వ తేది విద్యా సమీక్షా సమావేశాలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో చర్చించే అంశాల గురించి, ప్రతి నెలా చివరి వారంలో తెలియజేస్తామన్నారు. ఆ ప్రకారం, డిసెంబరు 5వ తేది ఆన్‌లైన్‌లో ఈ సమావేశం జరుగుతుందని సర్క్యులర్‌లో తెలిపారు.

పెంపుడు జంతువుల లైసెన్స్ గడువు పొడిగింపు

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువుల లైసెన్స్ గడువును గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పొడిగించింది. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో శునకాలు, పిల్లులు ఇతర పెంపుడు జంతువులను వదిలేయకుండా నిరోధించేలా 'మైక్రో చిప్' తప్పనిసరి చేశామన్నారు. ఈ నెల 8వ తేది నుంచి కార్పొరేషన్‌లోని పెంపుడు జంతువుల చికిత్సా కేంద్రాలో ఉచితంగా చిప్ వేస్తున్నామన్నారు. పెంపుడు జంతువుల యజమానుల కోరిక మేరకు లైసెన్స్ గడువు డిసెంబరు 7వ తేది వరకు పొడిగించినట్లు జీసీసీ తెలిపింది.

వైద్యకోర్సుల్లో 48 ఖాళీ సీట్లు

● భర్తీకి అనుమతి కోరుతూ లేఖ

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగో విడత కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, ఖాళీగా ఉన్న 48 సీట్ల భర్తీకి అవకాశం కల్పించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ లేఖ రాసింది. ప్రభుత్వ, స్వయంప్రతిపత్తి కళాశాలల్లో ప్రభుత్వ కోటాలో 6,600 ఎంబీబీఎస్, 1,583 బీడీఎస్ సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో 1,736 ఎంబీబీఎస్, 530 బీడీఎస్ సీట్లున్నాయి. ఈ కోర్సులకు తుది విడత కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, 48 సీట్లు ఇంకా భర్తీ కాలేదు. ఈ సీట్ల భర్తీకి అనుమతించాలని కోరుతూ జాతీయ వైద్య కమిషన్ (ఎంఎంసీ)కి లేఖ రాశారు. ఈ విషయమై వైద్య విద్యార్థుల ఎంపిక బోర్డు కార్యదర్శి లోకనాయకి మాట్లాడుతూ... చెన్నై, కడలూరు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మూడు బీడీఎస్ సహా స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో, ప్రభుత్వ, మేనేజ్‌మెంట్ కోటాలో 48 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోటాలో ఒక బీడీఎస్ సీటు ఖాళీ ఉందని తెలిపారు. ఈ సీట్ల భర్తీకి అవకాశం కల్పించాలని ఎంఎంసీకి లేఖ రాసినట్లు ఆమె తెలిపారు.

ఉచిత వైద్యసేవలకు '104'

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే వెళ్లి వైద్యసేవలందించేలా 'మక్కల్ తేడి మరుదువం' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకానికి మంచి స్పందన లభించగా, నగర ప్రాంతాల్లో తక్కువగా ఉంది. ఈ విషయమై దృష్టి సారించిన ఆరోగ్యశాఖ, నివాసిత సంఘాలతో కలసి ఈ పథకం అమలుకు చర్యలు చేపట్టింది. ఈ విషయమై ఆరోగ్యశాఖ డైరెక్టర్ సోమసుందరం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... చెన్నై, కోవై, మదురై తదితర నగర ప్రాంతాల ప్రజలు చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారన్నారు. ఈ కారణంగా, నగర ప్రాంతాల్లో 'మక్కల్ తేడి మరుదువం' పథకానికి స్పందన తక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం నివాసితుల సంక్షేమ సంఘాలతో కలసి వారి వద్దకే వెళ్లి వైద్యసేవలందించాలని నిర్ణయించామన్నారు. ఆ ప్రకారం, గృహ సముదాయాల్లో నివసించే వారు '104' అనే నెంబరుకు సంప్రదిస్తే, వైద్య సిబ్బంది బృందం వారి వద్దకే వెళ్లి చికిత్స అందించనుందని ఆరోగ్యశాఖ తెలిపింది.

విజయ్ సభకు డిజిటల్ కార్డులున్న వారికే అనుమతి

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మహాబలిపురం రోడ్డులోని జేప్పియార్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో ఆదివారం జరగనున్న టీవీకే కాంచీపురం జిల్లా నాయకుల సమావేశానికి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తెలిపారు. పార్టీ ఇచ్చిన డిజిటల్ గుర్తింపు కార్డులున్న 2 వేల మందికే ఈ సమావేశంలో పాల్గొనేందుకు అనుమతిస్తామని తెలిపారు. పార్టీ కాంచీపురం జిల్లాలో కాంచీపురం, ఉత్తిరమేరూరు, శ్రీపెరుంబుదూరు నియోజకవర్గాల పరిధిలోని పార్టీ నిర్వాహకులు, బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు, స్థానిక ప్రజలు ఈ సమావేశంలో పాల్గొంటారని ఆయన చెప్పారు.

రోడ్ల మరమ్మతులు పూర్తిచేయండి

తిరుత్తణి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పళ్లిపట్టు నుండి ఆంధ్రప్రదేశ్ చిత్తూరు, నగిరి, కార్వేటినగరం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని కొన్ని నెలల క్రితం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించిన రహదారులశాఖ అధికారులు నాణ్యతలేని రోడ్లు నిర్మించారని అక్కడి ప్రజల ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు మళ్లీ దెబ్బతిన్నాయని, కలెక్టర్ స్పందించి నాణ్యమైన రోడ్లు వేయించాలని కోరారు.

మహిళలకు వేధింపులు

● టెన్త్ విద్యార్థి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఒంటరిగా వెళ్తున్న మహిళలను అసభ్య పదజాలంతో వేధిస్తున్న 10వ తరగతి విద్యార్థి కటకటాలపాలయ్యాడు. పుళల్ సెక్రటరియేట్ కాలనీకి చెందిన 23 ఏళ్ల యువతి ఘటన జరిగిన రోజు రాత్రి 8 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి నడిచి వెళ్తోంది. ఆ సమయంలో బైక్‌పై వచ్చిన వ్యక్తి, ఆ యువతిని అసభ్య పదాలతో వేధించి, బైక్‌లో పరారైనట్లు సమాచారం. దీనిపై బాధితురాలు పుళల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బైక్‌పై వచ్చిన వ్యక్తి హెల్మెట్ ధరించడం, మొఖానికి కర్చీఫ్ కట్టుకుని ఉండడంతో గుర్తించలేకపోయారు. మరుసటి రోజు రాత్రి పోలీసులు అదే ప్రాంతంలో గస్తీ చేపట్టగా, బైక్‌పై వచ్చిన వ్యక్తి మరో యువతిని వేధిస్తుండగా అదుపులోకి తీసుకుని, అతడు 15 ఏళ్ల బాలుడిగా గుర్తించారు. అదే ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నట్లు, తన తండ్రి బైక్ తీసుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతుంటాడని తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు విద్యార్థిని అరెస్ట్ చేసి, బైక్ స్వాధీనం చేసుకున్నారు.

తామ్రభరణి నుంచి

నీరు తోడేస్తుంటే మీరేం చేస్తున్నారు?

● రూ.20కి విక్రయించే లీటరు నీటికి ఒక్క పైసాయేనా?
● 20 ఏళ్ల క్రితం నిర్ణయించిన ఛార్జీ వసూలు చేస్తున్నారా?
● పూర్తి వివరాలు మా ముందుంచండి ● తిరునల్వేలి కలెక్టర్‌ను ప్రశ్నించిన హైకోర్టు


తామ్రభరణి నది

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తామ్రభరణి నది నుంచి ఇష్టానుసారంగా నీటిని తోడుకెళ్తున్న సంస్థల తీరు పట్ల మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తోందని నిలదీసింది. తామ్రభరణి నది నుంచి ఎన్ని సంస్థలు నీటిని పొందుతున్నాయి? అందుకోసం ఏ మేరకు వసూలు చేస్తున్నారు? తదతర వివరాలను తమ ముందుంచాలని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ పి.పుహళేంది నేతృత్వంలోని మదురై ధర్మాసనం తిరునల్వేలి జిల్లా కలెక్టర్‌కు, ప్రజా పనుల శాఖ కార్యదర్శికి నోటీసులు పంపింది. మినరల్ వాటర్ వ్యాపారం కోసం తామ్రభరణి నది నుంచి నీటిని తోడుకెళ్తున్న సంస్థలు.. ప్రభుత్వానికి రూ.250 కోట్ల వరకు పన్ను బకాయి వున్నారంటూ తూత్తుకుడి జిల్లాకు చెందిన కామరాజ్ ఇటీవల ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మదురై ధర్మాసనంలో విచారణ జరగగా.. కామరాజ్ తరపు న్యాయవాది వాదనలు విని పిస్తూ.. పలు కర్మాగారాలకు నీటిని ఆపేసిన అధికారులు.. నీటి కర్మాగారాలకు మాత్రం ఇబ్బడిముబ్బడిగా సరఫరా చేస్తున్నారని వివరించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వానికి రూ.250 కోట్ల మేరకు ఆయా సంస్థలు బకాయి వున్నాయన్నారు. దీనికి తోడు ప్రైవేటు సంస్థలు ఇష్టానుసారంగా నీటిని తోడుకెళ్తుండడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని వివరించారు. అందువల్ల తామ్రభరణి నదీతీరంలో వెలసిన కర్మాగారాలు, సంస్థలు వెంటనే ప్రభుత్వానికి బకాయిలు చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. మినరల్ వాటర్ విక్రయిస్తున్న సంస్థల నుంచి ఏ మేరకు చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రశ్నించింది. ఆయా సంస్థల నుంచి లీటరుకు పైసా చొప్పున రుసుంగా వసూలు చేస్తున్నామని, ఈ చార్జీలను 20 ఏళ్ల క్రితం నిర్ణయించారని ప్రభుత్వ న్యాయవాది వివరించారు. ఆ సమాధానంతో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ప్రైవేటు సంస్థలు లీటరు నీటికి రూ.20 వసూలు చేస్తుండగా, వారి నుంచి కేవలం పైసా తీసుకోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 20 ఏళ్ల క్రితం నిర్ణయించిన ధరలనే ఎందుకు వసూలు చేస్తున్నారని, ఈ చార్జీలను ఎందుకు పెంచలేదని నిలదీసింది. పిటిషనర్ ఆరోపించినట్లు ప్రైవేటు సంస్థలు తమ ఇష్టానుసారంగా నీటిని తోడుకెళ్తుంటే ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తోందని ప్రశ్నించింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

పీఎంకే కార్యవర్గ సభ్యుడిగా సుకుందన్

● డాక్టర్ రాందాస్ నిర్ణయం

అడయార్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తండ్రీకొడుకుల మధ్య ఏర్పడిన ఆధిపత్యపోరు కారణంగా పీఎంకేలో పెనుమార్పులు వస్తున్నాయి. ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ సంచలన నిర్ణయాలు తీసుకుంటూ పార్టీ శ్రేణులను విస్మయానికి లోనుచేస్తున్నారు. ఇప్పటికే పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా తన పెద్ద కుమార్తె శ్రీగాంధీని నియమించిన రాందాస్.. ఇపుడు పార్టీ కార్యవర్గ సభ్యుడుగా శ్రీగాంధీ పెద్ద కుమారుడు సుకుందన్ పరశురామన్‌ను నియమించారు. శ్రీగాంధీకి ముగ్గురు కుమారులు కాగా, వీరిలో పెద్ద కుమారుడు సుకుందన్. రెండో కుమారుడు పృథ్వీ. ఈయన డాక్టర్ అన్బుమణి కుమార్తెను వివాహం చేసుకున్నారు. మూడో కుమారుడు ముకుందన్. ఈయనను పీఎంకే యువజన విభాగం పదవిని రాందాస్ కట్టబెట్టగా, అన్బుమణి తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో తండ్రీకుమారుల మధ్య మనస్పర్థలు తలెత్తి పార్టీ రెండుగా చీలిపోయింది. ఈ నేపథ్యంలో శ్రీగాంధీని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఇపుడు సుకుందన్‌ను పార్టీ కార్యవర్గ సభ్యుడుగా రాందాస్ ఎంపిక చేయడం పార్టీ నేతల్లో చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే తైలాపురం గార్డెన్‌లో పీఎంకే జిల్లా కార్యదర్శులు, వన్నియర్ సంఘాల జిల్లా నేతలతో రాందాస్ సమావేశంకానున్నారు. ఇందులో సుకుందన్‌ను పరిచయం చేసి, ఆ తర్వాత శ్రీగాంధీ, సుకుందన్‌లను రాష్ట్ర పర్యటనకు పంపాలన్న రాందాస్ ఆలోచిస్తున్నారు.

ఆస్పత్రిలోకి నాగుపాము

● భయంతో పరుగులు తీసిన రోగులు
● ఆర్కేపేట బస్టాండులో కొండచిలువ


ఆర్కే పేటలో పట్టుకున్న కొండచిలువ

తిరుత్తణి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నాగుపాము ప్రవేశించి పేషెంట్లను భయాందోళనకు గురిచేసింది. వివరాల్లోకి వెళితే.. ఆ ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులో సుమారు 250 మంది గర్భిణులున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం వార్డులోకి ఓ నాగుపాము చొరబడి అందరినీ భయభ్రాంతులను చేసింది. దీంతో రోగులంతా బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెళ్లి పామును పట్టుకున్నారు.

కొండచిలువ పట్టివేత...

తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేటలోని కొండాపురం బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి ఓ కొండ చిలువ రోడ్డుపై రావడంతో ప్రయాణికులు హడలెత్తిపోయారు. సుమారు పదడుగులున్న ఆ కొండచిలువను చూసి ప్రజలు ఆర్కేపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అటవీశాఖ అధికారులతో కలిసి అక్కడికి చేరుకుని దానిని బంధించి సమీపంలోని అడవీ ప్రాంతంలో వదిలివేశారు.

కాలువ డిజైన్ మార్చండి: మాజీ మంత్రి రమణ

తిరువళ్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక నేతాజీ రోడ్డులో నిర్మిస్తున్న వర్షపు నీటి కాలువ ప్రజలకు ఇబ్బందిగా మారనుందని, ఈ విషయం పరిగణలోకి తీసుకుని కాలువ డిజైన్ మార్చాలని అన్నాడీఎంకే నేత మాజీ మంత్రి, తిరువళ్లూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ... తిరువళ్లూరు మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ రోడ్డు నుండి కోవిల్‌కులం రోడ్డు జంక్షన్ వరకు రూ.8 కోట్లతో వర్షపు కాలువ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. కాగా కాలువ డిజైన్ ఎత్తు పల్లాలుగా ఉండడంతో భారీ వర్షాలు వచ్చినప్పుడు ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో తాను స్వయంగా పరిశీలించి కాలువ డిజైన్‌లో లోపాలను గుర్తించానన్నారు. పలు చోట్ల నివాసాల మట్టానికి అడుగు ఎత్తున కాలువ నిర్మాణం చేపట్టడంతో వర్షాలు కురిసినప్పుడు ఇళ్లలోకి మురుగు నీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు తెలిపారన్నారు. డిజైన్ మార్చిన తర్వాత పనులు ప్రారంభించాలని కేంద్ర రహదారుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతాప్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నాడీఎంకే జిల్లా విద్యార్థి సంఘం కార్యదర్శి బాలాజీ, నగర కార్యదర్శి కందసామి, నాయకులు నేసన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు కింద తల పెట్టి టెక్కీ ఆత్మహత్య

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బస్సు చక్రం కింద తల పెట్టి ఐటీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వాషర్‌మెన్‌పేటలో కలకలం రేపింది. వాషర్‌మెన్‌పేట ప్రాంతానికి చెందిన జియావుల్లా (32) అదే ప్రాంతంలోని ఓ ఐటీ సంస్థలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో, శుక్రవారం రోడ్డుపై వెళ్తున్న బస్సు చక్రం కింద తల ఉంచి జియావుల్లా ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

● కలెక్టర్ ప్రతాప్


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరువళ్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లా కాకలూరు పంచాయతీలోని ప్రభుత్వ ఉన్నత మాధ్యమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్ పథకం ద్వారా డిసెంబర్ 10వ తేది వరకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల ప్రాముఖ్యత వంటి వాటిపై అవగాహన కల్పించే విధంగా వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తున్నామని తెలిపారు.. ఉపయోగంలోలేని కమ్యూనిటీ మరుగుదొడ్ల కాంప్లెక్స్‌లను గుర్తించి, మరమ్మత్తులు చేసి వినియోగానికి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ జయకుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ నర్మద, అసిస్టెంట్ డైరెక్టర్ పి.మోహన్, అధికారులు జానకి, సెల్వకుమార్, ప్రధానోపాధ్యాయులు జగదీశ్వరన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దుల మృతి


మృతిచెందిన ఎద్దుల వద్ద రైతు

తిరుత్తణి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొలం దున్నుతుండగా విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతిచెందిన సంఘటన తిరువళ్లూరు జిల్లా విరకానల్లూరు సమీపంలోని మోట్టూరు గ్రామంలో జరిగింది. వివరాలిలా.. ఆ గ్రామంలో వ్యవసాయం చేస్తున్న వెంకటరత్నం పొలం పనుల నిమిత్తం కన్నన్ దగ్గరున్న రెండు ఎద్దులను తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో, పొలం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుండి ఇతర పొలాల్లోకి లాగిన వైర్‌లైన్‌లో లీకేజీ ఏర్పడింది. దానిని గమనించని వెంకటరత్నం పొలంలోకి ఎడ్లను దింపగానే అవి విద్యుదాఘానికి గురైయ్యాయి.ఇది చూసిన అతను భయంతో కేకలు వేయగా, పక్కనున్న రైతులు అక్కడికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే ఆ రెండు ఎడ్లు మృతిచెందాయి. దీనిపై ఎడ్ల యజమాని కన్నన్ మాట్లాడుతూ, విద్యుత్ లైన్‌మన్లు పొలాలకు నిర్లక్ష్యంగా వైరింగ్ ఏర్పాటు చేస్తున్నారని, వారి నిర్లక్ష్యం కారణంగానే రెండు ఎద్దులు, మృతిచెందాయని, ఎడ్లతో పాటు రైతు కూడా దిగివుంటే అతను కూడా మృతిచెందేవాడని, లైన్‌మెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈదురుగాలులతో కూలిన అరటి చెట్లు


గాలులకు నేలకొరిగిన అరటి చెట్లు

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో ఈదురుగాలులకు 1.50 లక్షల అరటి చెట్లు నేల కూలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా, కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి తదితర దక్షిణ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీవర్షాలు కురుస్తున్నాయి. తిరునల్వేలి జిల్లా చేరన్‌మహాదేవి, మేల్ సెవల్, పిరంజేరి, చొక్కలింగపురం, గోపాలసముద్రం తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో రైతులు అరటి సాగుచేస్తున్నారు. జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. ఈ కారణంగా, కోతకు సిద్ధంగా ఉన్న సుమారు 1.50 లక్షల అరటి చెట్లు నేలకొరిగాయి. పంట చేతికందే సమయంలో ఈదురుగాలులు తమకు తీవ్ర నష్టం కలిగించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సహదేవ పేటలో చిరుతపులి సంచారం

గాలిస్తున్న అటవీ సిబ్బంది


రిటైర్డ్ డ్రైవర్ శివరాజ్‌ను ప్రశ్నిస్తున్న అధికారులు

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా వలవనూరు సమీపం సహదేవపేటలో చిరుతపులి సంచరించడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనచెందుతున్నారు. ఆ గ్రామంలోని పిళ్ళయార్ కోయిల్ వీధిలో నివసిస్తున్న అటవీ శాఖ మాజీ డ్రైవర్ శివరాజ్ (71) వంటగదిలో ఉండగా, ఆ గది పక్కనే సభాపతి అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో చిరుతపులి నడచుకుంటూ వెళ్లటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే ఆ విషయాన్ని అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై శివరాజ్ మాట్లాడుతూ ఉదయం 9.45 గంటల సమయంలో తన ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో చిరుతపులి నడచుకుంటూ వెళుతుండటాన్ని చూశానని తెలిపారు. మురుగన్ కోవిల్ వీధి నుంచి వచ్చిన ఆ చిరుతపులి ద్రౌపది అమ్మన్ కోవిల్ వీధి మీదుగా వెళ్ళిందని తెలిపారు. చిరుతపులి సంచారంపై పొలాల్లో పనిచేస్తున్న కార్మికులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న విల్లుపురం అటవీ రేంజర్ గుణశేఖరన్ నేతృత్వంలో నలుగు సభ్యుల బృందం ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ ప్రారంభించింది. అటవీ శాఖ సిబ్బంది పరిశీలించగా చిరుతపులి కాలి ముద్రలు ఎక్కడా కనిపించలేదని గుణశేఖరన్ తెలిపారు. ఆ చిరుతపులి ఆచూకీ కనుగొనేందుకు డ్రోన్‌లను ఉపయోగించనున్నట్లు తెలిపారు.

పొత్తుల కోసం కమిటీ ఏర్పాటుతో టీవీకే ప్రయత్నాలకు బ్రేక్



● కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సీట్ల కేటాయింపులపై డీఎంకే అధిష్ఠానంతో చర్చలు జరిపేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం పేర్కొన్నారు. ఈ పొత్తుకమిటీ ఏర్పాటుతో నటుడు విజయ్ నాయకత్వంలోని టీవీకే కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలన్నింటికి అడ్డుకట్ట పడినట్లేనని ఆయన చెప్పారు. ఈ కమిటీని ఏర్పాటు చేసి కాంగ్రెస్ అధిష్ఠానం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ డీఎంకేతో పొత్తు కొనసాగుతుందని పరోక్షంగా టీవీకే నేతలకు స్పష్టం చేసిందని తెలిపారు. శనివారం ఉదయం ఆయన ఎక్స్ పేజీలో ఓ సందేశం వెలువరిస్తూ విజయ్ పార్టీ ప్రారంభించినప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆ పార్టీ ప్రభావం అధికంగా ఉంటుందని, వివిధ పార్టీల ఓటు బ్యాంకు తగ్గే అవకాశాలుంటాయని అందరూ భావించారని, అయితే విజయ్ పర్యటనల్లో జరిగే అవాంఛనీయ సంఘటనలు ఆ పార్టీ పట్ల ప్రజాదరణ బాగా తగ్గించిందని తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం పొత్తుకమిటీని ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఇండియా కూటమి పటిష్ఠతను ఎలుగెత్తి చాటిందని చిదంబరం పేర్కొన్నారు.

ఉత్తర చెన్నై టీవీకేలో ముఠా రాజకీయాలు

● మహిళా నేత ఆత్మహత్యాయత్నం

ప్యారీస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)లో ముఠా రాజకీయాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. ఉత్తర చెన్నైలో గ్రూప్ రాజకీయాల వల్ల ఆ పార్టీ నిర్వాహకులు తరచూ వాగ్వాదాలకు దిగుతున్నారు. ఈ క్రమంలో మనలికి చెందిన టీవీకే జిల్లా మహిళా విభాగంలో ఇళయరసి, కల్పన ముఠాగా వ్యవహరించడం వివాదాస్పదమైంది. జిల్లా యువజన విభాగం కార్యదర్శి ఈఎం.రమేష్ ఇటీవల జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఇళయరసిని మందలించడంతో మనస్తాపానికి గురైన ఆమె తాను ఆత్మహత్య చేసుకోనున్నట్లు వాట్సాప్‌లో పార్టీ కార్యకర్తలకు సమాచారం పంపించింది. కల్పన ఈ విషయాన్ని ఇళయరసి భర్తకు ఫోన్ చేయడంతో ఆయన వెంటనే ఇంటికెళ్లి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. దీనిపై అందజేసిన ఫిర్యాదు ఆధారంగా మనలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రాష్ట్ర హక్కులను హరిస్తున్న బీజేపీ

● సీపీఐ నేత డి.రాజా

అడయార్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రాల హక్కులను హరిస్తోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆరోపించారు. తమిళనాడు రాష్ట్ర శాఖ కార్యవర్గ సమావేశం విరుదునగర్ జిల్లాలోని రాజపాళయంలో జరిగింది. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ ధాన్యంలోని తేమ శాతాన్ని పెంచేందుకు నిరాకరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ఈ నెల 23, 24వ తేదీల్లో డీఎంకే కూటమి పార్టీల ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందని, ఇందులో తమ పార్టీ కూడా పాల్గొంటుందన్నారు. మదురై, కోయంబత్తూరు మెట్రోరైల్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతివ్వకపోవడం వెనుక రాజకీయ కోణం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం, అఖిలపక్ష పార్టీల అభిప్రాయాలకు గౌరవిస్తూ సర్‌ను తక్షణం నిలిపివేయాలని కోరారు. ఎన్నికల సంఘం, ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజకీయాలకతీతంగా పనిచేయాలని కోరారు. వచ్చే యేడాది జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో చేతులు కలిపే ఏ పార్టీనైనా ప్రజలు తిరస్కరిస్తారని డి.రాజా జోస్యం చెప్పారు.

చోరీలకు పాల్పడిన ఉత్తరాది ముఠా అరెస్ట్

ప్యారీస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూరు పూంపుహార్‌నగర్‌లో నివసిస్తున్న వ్యాపారవేత్త రాజశేఖర్ ఇంట్లోకి చొరబడి మూడు సవర్ల నగలు, రూ.12వేల నగదు చోరీ చేసిన కేసులో ఉత్తరాదికి చెందిన ఓ మహిళతో పాటు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 10వ తేదీ తమ ఇంట్లో చోరీ జరిగినట్లు రాజశేఖర్ కొళత్తూరులోని ఆర్థిక నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కలైసెల్వి కేసు నమోదు చేసి సంఘటన జరిగిన ప్రాంతాల్లో సీసీ పుటేజీని పరిశీలించి నేరస్తుల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. విచారణలో రాజశేఖర్ కుమార్తె ఐశ్వర్య రాయపేటలో నడుపుతున్న టీ దుకాణంలో పనిచేస్తున్న ఉత్తరాది చెందిన ఓ వ్యక్తి ఈ దోపిడీకి పాల్పడినట్లు తేలింది. దీనితో శుక్రవారం సాయంత్రం షబీనా అనే మహిళ సహా ఆకాష్, ఆదేష్‌లను పోలీసులు అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బాలుడిపై లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడికి ఏడేళ్ల జైలుశిక్ష

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వృద్ధుడికి ఏడున్నర ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. తిరునల్వేలి జిల్లా తులకార్‌పట్టికి చెందిన సోమసుందరం (67) 2023లో ఓ మూడేళ్ల బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయమై బాధిత బాలుడి తల్లి మానూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి సోమసుందరంను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ తిరునల్వేలి జిల్లా పోక్సో కోర్టులో ముగిసిన నేపథ్యంలో, నేరారోపణ రుజువు కావడంతో నిందితుడు సోమసుందరంకు ఏడున్నరేళ్ల జైలుశిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సురేష్‌కుమార్ శుక్రవారం తీర్పు వెలువరించారు.

బ్యాంకులో రుణం తీసుకోవాలంటూ భార్యకు చిత్ర హింసలు

అడయార్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీకల వరకు మద్యం సేవించి బ్యాంకులో రుణం తీసుకోవాలంటూ భార్యను చిత్ర హింసలకు గురిచేసిన భర్త కోసం అన్నా నగర్ పోలీసులు గాలిస్తున్నారు. కోయంబేడు అన్నా వీధికి చెందిన కరుప్పుస్వామి (48) అనే వ్యక్తి కోయంబేడు మార్కెట్‌లో కూలి పనులు చేస్తుంటాడు. అయితే, ప్రతి రోజూ మద్యం సేవించి వచ్చి భార్య వాసుకిని వేధించసాగాడు. ఈ క్రమంలో బ్యాంకులో రుణం తీసుకోవాలంటూ భార్యపై ఒత్తిడి చేయగా ఆమె నిరాకరించింది. దీంతో ఆమెను కొట్టి హింసించాడు. ఈ వేధింపులను భరించలేని ఆమె కోయంబేడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కరుప్పుస్వామి ఇంటి నుంచి పారిపోగా, అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

తిరువళ్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువతులు అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. ఆయా కుటుంబీకులు ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. తిరువళ్లూరు జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువతి (20) తల్లిదండ్రులు మరణించడంతో పెద్దమ్మ దగ్గర వుంటోంది. డిగ్రీ వరకు చదివిన ఆమె ఈ నెల 20న ఇంటి నుండి వెళ్ళి తిరిగి రాలేదు. ముప్పేడు పోలీసులు ఆమె ఆచూకీ కోసం గాలిస్తున్నారు. అదే విధంగా గుమ్మిడిపూండి శ్రీలంక శరణార్థుల శిబిరంలో నివాసం ఉంటున్న యువతి (19) శుక్రవారం సరుకులకోసం బజారుకు వెళ్ళి తిరిగి రాలేదు. ఆమె జాడ తెలియకపోవటంతో కుటుంబీకులు సిప్కాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

భవనంపై నుంచి కిందపడి ఉత్తరాది కార్మికుడి మృతి

తిరువళ్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుమ్మిడిపూండి సిప్కాట్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సిప్కాట్ పారిశ్రామిక వాడలో 'కూలింగ్ టవర్స్' అనే కంపెనీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుల్తాన్‌ఖాన్ (27) పని చేస్తున్నాడు. శనివారం 80 అడుగుల ఎత్తయిన భవనంపైకి ఎక్కి పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సిప్కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని కంపెనీ సూపర్‌వైజర్ రోషన్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.

హరీష్ కళ్యాణ్ కొత్త చిత్రం 'దాషమకాన్'


'దాషమకాన్'లో హరీష్ కళ్యాణ్

హరీష్ కళ్యాణ్ హీరోగా నటించే కొత్త చిత్రానికి 'దాషమకాన్' అనే టైటిల్ ఖరారు చేసినట్టు శనివారం అధికారికంగా వెల్లడించి, మూవీ ఫస్ట్ లుక్, మూవీ ప్రోమో రిలీజ్ చేశారు. వినీత్ ప్రసాద్ దర్శకత్వంలో ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. 'పార్కింగ్', 'డీజిల్' సినిమాల తర్వాత హరీష్ కళ్యాణ్ నటించే పూర్తి యాక్షన్ భరిత చిత్రంగా 'దాషమకాన్'ను తెరకెక్కిస్తున్నారు. థింక్ స్టూడియోస్ సమర్పణలో ఐడా ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమవుతోంది. ప్రీతి ముకుందన్ హీరోయిన్. అంతేకాకుండా, హరీష్ కళ్యాణ్ ఇప్పటివరకు నటించిన చిత్రాల్లోకెల్లా భారీ బడ్జెట్ మూవీగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

'ఉన్ పార్వైయిల్'లో పార్వతి డ్యూయల్ రోల్

ప్రఖ్యాత బాలీవుడ్ కెమెరామెన్ కబీర్ లాల్ దర్శకత్వంలో ప్రముఖ హీరోయిన్ పార్వతి నాయర్ తొలిసారి ద్విపాత్రాభినయం చేసిన చిత్రం 'ఉన్ పార్వైయిల్'. చిత్రీకరణ పూర్తి చేసుకుని డిసెంబరులో విడుదలకు సిద్ధంగా ఉంది. లవ్‌లీ వరల్డ్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానరుపై వినూత్నమైన క్రైమ్ థ్రిల్లర్ మూవీగా రూపొందించారు. సీనియర్ నటుడు గణేష్ వెంకట్‌రామ్ మనస్తత్వవేత్తగా, పార్వతి నాయర్ భర్తగా నటించారు. ఇతర పాత్రల్లో సీనియర్ నటులు నిళల్‌గల్ రవి, తులసి నటించగా, నిర్మాత అజయ్ కుమార్ సింగ్ ఇన్‌స్పెక్టర్ పాత్ర పోషించారు. ఈ సినిమా వివరాలను పార్వతి నాయర్ వివరిస్తూ, 'ఇది ఒక సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీ. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉత్కంఠ భరితంగా సాగుతుంది. తమిళంలో తొలిసారి డబుల్ రోల్ చేశాను. పైగా ఇది లేడీ ఓరియంటెడ్ మూవీ. తన సోదరి అనుమానాస్పద మృతిపై చేపట్టిన అన్వేషణలో ఎదురయ్యే సమస్యలు, మిస్టరీ సంఘటనల సమూహారమే ఈ సినిమా. డిసెంబరు మూడో వారంలో విడుదల చేస్తున్నాం. బాలీవుడ్‌లో ఎంతో పేరొందిన కబీర్ లాల్ దర్శకత్వంలో నటించడం ఒక గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా విశేష ఆదరణ పొందుతుందన్న నమ్మకం ఉంది. ప్రస్తుతం తమిళ, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో నటిస్తున్నాను. తెలుగులో 'జెండాపై కపిరాజు'లో నటించినప్పటికీ అందులోని ప్రాత చెప్పుకోదగిన రీతిలో లేదు. ఇపుడు టాలీవుడ్‌లో కూడా నటించేందుకు అవకాశాలు వస్తున్నాయి. కానీ, సరైన కథ కోసం ఎదురు చూస్తున్నాను. మంచి కథ లభిస్తే మాత్రం ఖచ్చితంగా తెలుగులో కూడా నటిస్తాను' అని వివరించారు.


పార్వతి నాయర్

28న 'పూంగా' రిలీజ్

చిత్రజ్యోతి


'పూంగా'లో ఓ దృశ్యం

ఒక పార్కులో జరిగే సంఘటనలతో తెరకెక్కించిన 'పూంగా' చిత్రాన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్టు దర్శక నిర్మాతలు ప్రకటించారు. అళగు మూవీస్ పతాకంపై రూపొందిన ఈ చిత్రంలో కేపీ ధనశేఖర్. కౌశిక్, ఆరా హీరో హీరోయిన్లుగా నటించగా, శశి దయా, ప్రాణ, బాలసుబ్రహ్మణ్యం, పూంగా రాము, దిండుగల్ మణికంఠన్, నోయెల్ రేజీ, మ్యాజిక్ శరవణ కుమార్, సాయి జేపీ తదిరులు నటించారు. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కేజీ ధనశేఖర్‌ఈ సినిమా విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'పూంగా' అనేది కేవలం వాకింగ్, వినోదం కోసం నిర్మించింది కాదు. అది ఒక జీవన విధానం. విభిన్న వ్యక్తుల సంగమం. ఆకాశంలో స్వర్గం ఉంటుందన్నది నానుడి. కానీ, భూమిపై ఉండే స్వర్గం 'పూంగా2 (పార్కు). నలుగురు యువకులు తమతమ సమస్యలతో పార్కుకు వస్తారు. అక్కడ వారి సమస్యలకు పరిష్కారం లభించిందా లేదా అన్నదే ఈ చిత్ర కథ' అని వెల్లడించారు.

ఇండియన్ పనోరమ ప్రారంభ చిత్రంగా 'అమరన్'


గోవా చిత్రోత్సవ వేడుకల్లో 'అమరన్' టీమ్

గోవా వేదికగా ప్రారంభమైన 'ఐఎఫ్ఎఫ్ఐ-2025' చిత్రోత్సవాల్లో భాగంగా ఇండియన్ పనోరమ విభాగంలో ప్రారంభ చిత్రంగా 'అమరన్' మూవీ ప్రదర్శించారు. అగ్ర నటుడు కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ (ఆర్‌కేఎఫ్ఐ), టర్మరిక్ మీడియా సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించారు. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వం. 'అశోక చక్ర' పురస్కార గ్రహీత దివంగత మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని నిర్మించిన ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో రిలీజ్ చేయగా బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఇండియన్ పనోరమ విభాగంలో 'అమరన్'చిత్రం ప్రదర్శనతో ప్రారంభించారు. పనోరమాకు ఈ సినిమా ఎంపిక కావడం పట్ల ఆ చిత్ర బృందం హర్షం వ్యక్తం చేసింది. పైగా ఈ ప్రారంభ వేడుకల్లో నిర్మాత కమల్ హాసన్, సహ నిర్మాత రాజ్‌కుమార్, దర్శకుడు రాజ్ కుమార్ పెరియస్వామి, హీరో శివకార్తికేయన్, సాయిపల్లవి పాల్గొన్నారు.

మెట్రోరైల్‌కు అవాంతరాలు





SUNDAY SPECIAL

అన్నీ.. అవరోధాలే !

మదురైకి మంచి రోజులొచ్చేనా?

- ఎయిమ్స్ నుంచి మెట్రోరైలు వరకు అన్నీ పెండింగే
- పార్టీల నేతలకు కానరాని చిత్తశుద్ధి

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మీనాక్షి అమ్మవారు కొలువైన మదురై నగరం ఇప్పుడు సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. ఓట్ల కోసం అభివృద్ధి ప్రాజెక్టులను ఇబ్బడిముబ్బడిగా ప్రకటించిన పార్టీలు .. వాటి అమలుకు మాత్రం సాకులు వెతుక్కుంటున్నాయి. తమ నిర్లక్ష్యాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని కూడా ప్రత్యర్థి పార్టీలకు చుట్టే ప్రయత్నం చేస్తున్నాయి. కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఎయిమ్స్, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెట్రో రైల్ ప్రాజెక్టు ఇప్పుడు వివాదాల్లో చిక్కుకున్నాయి. ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన ఆయా పార్టీల ప్రభుత్వాలు.. అమలులో మాత్రం వెనుకడుగువేయడంతో పాటు ఆ నెపాన్ని ప్రత్యర్థులపైకి నెట్టేందుకు యత్నిస్తున్నాయి..

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

రాజుల కాలం నుంచే ఘన చరిత్ర కలిగిన నగరం మదురై. అప్పట్లో దీనికన్నా చిన్నవి, జనసమూహ ప్రాంతాలు మహానగరాలుగా రూపాంతరం చెందగా, మదురై మాత్రం ఇప్పటికీ అలానే వుంది. మీనాక్షి అమ్మవారి ఆలయం, నాయకరాజుల పురాతన కోట తప్ప చెప్పుకోవడానికి మరేమీ లేదన్నట్లుగా తయారైందీ నగరం పరిస్థితి. చారిత్రక, పర్యాటక ప్రాముఖ్యత కలిగిన ఈ ఆధ్యాత్మిక నగరం అరకొర సదుపాయాలతోనే కాలం వెళ్లదీస్తోంది. ఆ నగర జనాభా 20లక్షలు దాటినా ట్రాఫిక్ రద్దీ, అంతర్గత మౌలిక సదుపాయాల లోపం వల్ల నగరాభివృద్ధి మరింత కుంటుపడుతోందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో మదురైలో ఎయిమ్స్ నిర్మిస్తామని, అక్కడి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పిస్తామని దశాబ్దం క్రితం బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దాంతో ఇక తమ ప్రాంతానికి మంచి రోజులొస్తాయని ఆ నగరవాసులంతా ఆశించారు. అయితే ఇప్పటి వరకూ ఆ రెండు ప్రాజెక్టులు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా పడివున్నాయి.



విస్తరణ కోసం విమానాశ్రయం ఎదురుచూపులు

నీళ్లు నములుతున్న కేంద్రం

స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి రాష్ట్ర నాయకుల దాకా ప్రతి ఒక్కరూ ఈ రెండు ప్రాజెక్టులు అమలు కాకపోవడానికి కేంద్ర ప్రభుత్వమే కారణమంటూ వేలెత్తి చూపుతూ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ ఈ ప్రాజెక్టులను అమలు చేసి తీరుతామంటూ శపథాలు మాత్రం చేస్తున్నారు. ఎయిమ్స్ గురించి నిలదీస్తే కేంద్రం నీళ్లు నములుతోంది. ఈ విషయమై ఆ నగరానికి చెందిన కొంతమంది సామాజిక కార్యకర్తలు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో 'ఎయిమ్స్' హాస్పిటల్ ప్రాజెక్టు త్వరగా అమలు చేసేలా చర్యలు చేపడతామంటూ డీఎంకే హామీ ఇచ్చింది. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్థికమంత్రిగా పదవీ స్వీకారం చేసిన మదురై జిల్లాకు చెందిన పళనివేల్ త్యాగరాజన్ మదురై విమానాశ్రయ విస్తరణ కోసం చాలా కాలంగా పెండింగ్‌లో స్థల సేకరణ పనులను రెండు వారాల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. డీఎంకే ప్రభుత్వ పదవీ కాలం ముగియనున్నా, ఇప్పటి వరకూ విమానాశ్రయ విస్తరణకు అవసరమైన స్థలాన్ని సేకరించి కేంద్ర విమానయాన సంస్థకు అప్పగించలేదు. విమానాశ్రయానికి చేరువుగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పాలకులిచ్చిన హామీ ఇంకా నెరవేరనే లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర విమానయాన సంస్థ మదురై విమానాశ్రయం వద్ద ప్రహరీ నిర్మించి, స్థల సేకరణ ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూస్తోంది. ఈ స్థల సేకరణ విషయంలో ఎదురవుతున్న సమస్యలపై జిల్లాకు చెందిన మంత్రులు డీఎంకే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లటానికి జంకుతున్నారు. దేశంలో మదురై ఎయిమ్స్‌తోపాటు ప్రకటించిన ఇతర నగరాలకు చెందిన ఎయిమ్స్ ఆస్పత్రులు ప్రస్తుతం చక్కగా పనిచేస్తున్నాయి. కానీ వివిధ రాజకీయ కారణాల వల్ల స్థల సేకరణ నుండి, నిర్మాణ పనుల వరకూ అన్ని పనులూ నత్తనడకనే సాగుతున్నాయి. ఇంకా మదురై ఎయిమ్స్ ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తికాలేదు. మదురై ఎయిమ్స్, విమానాశ్రయ విస్తరణ ప్రాజెక్టుల జాప్యంపై రాష్ట్రానికి చెందిన రాజకీయ పార్టీల వేళ్లన్నీ కేంద్ర ప్రభుత్వం వైపే చూపిస్తున్నాయి.

మెట్రో రైలు ప్రాజెక్టుపై పార్టీల అలక్ష్యం...

మెట్రోరైలు ప్రాజెక్టుకు అనుమతి నిరాకరించిందంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఖండిస్తూ విమర్శలు చేస్తున్న డీఎంకే కూటమి నేతలు ఈ ప్రాజెక్టు అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపలేదు. తగిన జనాభా వుంటేనే మెట్రోరైల్ ప్రాజెక్టుకు అనుమతి వస్తుందన్న నిబంధనలను మరచి తమపై విమర్శలు చేయడమేంటన్న కేంద్రం ప్రశ్నకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద సరైన సమాధానం లేదు. తమపై రాజకీయ కక్ష సాధించేందుకే కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మెట్రోరైల్ ప్రాజెక్టును అడ్డుకుంటోందని డీఎంకే నేతలు ఆరోపిస్తున్నారు. అదే నిజమైతే, చెన్నై మెట్రో రైలు రెండో దశ నిర్మాణం, తూత్తుకుడి విమానాశ్రయ విస్తరణ పనులకు కేంద్రం భారీగా నిధులు ఎలా విడుదల చేసిందని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మదురై- తూత్తుకుడి కొత్త రైలు మార్గం ప్రాజెక్టులో మదురై జిల్లాలో స్థలసేకరణే ప్రారంభం కాని పరిస్థితుల్లో తూత్తుకుడి జిల్లాలో కొన్నేళ్ల క్రితమే కొత్త రైలు మార్గం, రైల్వేస్టేషన్ల నిర్మాణం ఎలా సాధ్యమైందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అలా అయితే మదురై జిల్లాలోని ప్రజా ప్రతినిధులకు ఆసక్తి లేకపోవడమే మదురై నగరాభివృద్ధికి అడ్డం అని అర్థం చేసుకోవచ్చు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మదురై ఎయిమ్స్, విమానాశ్రయ విస్తరణ, మెట్రోరైలు ప్రాజెక్టులను అధికారంలోకి వచ్చి రెండు మూడేళ్లలోపునే పూర్తి చేస్తామని హామీలు గుప్పించి మదురై జిల్లాలో డీఎంకే కూటమి ఘనవిజయం సాధించింది. కానీ ఇప్పుడు మాత్రం ఆ కూటమి నేతలు కేంద్రంపై నెపం పెడుతున్నారు. మొత్తమ్మీద అటు కేంద్రం, ఇటు రాష్ట్ర పాలకుల వైఖరితో మదురై నగరం కీలకమైన ప్రాజెక్టుల సాధనలో వెనుకబడిపోతోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున ఓట్ల కోసం తమ ముంగిటకు వచ్చే నేతలను గట్టిగా నిలదీయాలని చైతన్యవంతులైన మదురై నగర ప్రజలు భావిస్తున్నారు. మరి నేతలు ఏం సమాధానం చెబుతారో వేచి చూద్దాం!


ఎయిమ్స్ నమూనా

ఊటీ కొండ రైలుకు కొత్త బోగీలు


కొత్త బోగీలతో ఊటీ కొండ రైలు

పెరంబూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఊటీ కొండ రైలుకు కొత్త బోగీలు అమర్చారు. కున్నూరు-ఊటీ, మేట్టుపాళయం మధ్య నడుపుతున్న కొండ రైలులో ప్రయాణించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో 2015లో దక్షిణ రైల్వే సూచనల మేరకు, ఐసిఎఫ్‌లో కొండ రైలు కోసం కొత్త గా 27 బోగీలు తయారుచేశారు. 2019లో తొలి నాలుగు బోగీలను పరిశీలించారు. కానీ కొండ వాలు ప్రాంతాల్లో పరిశీలించలేదని సీఏజీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కారణంగా రూ.27.91 కోట్ల నష్టం వాటిల్లినట్లు సీఏజీ పేర్కొంది. ఈ బోగీలు పూర్తిస్థాయి పరిశోధన అనంతరం కొండ రైలుకు వినియోగించాలని సూచించింది. ఈ నేపథ్యంలో, మేట్టుపాళయంలో నిలిపిన కొత్త బోగీలను యార్డ్‌కు తరలించి శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రస్తుతం నాలుగు కొత్త బోగీలను కొండ రైలుకు అనుసంధానం చేశారు. ఇప్పటికే వినియోగిస్తున్న నాలుగు పాత బోగీలు తిరుచ్చి డిపోకు తరలిస్తామని అధికారులు తెలిపారు.

- తెన్‌కాశిలో కుండపోత

కుట్రాలం వద్ద స్నానాలపై నిషేధం

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురిసిన కుండపోత వర్షాలకు ఆ జిల్లాలోని కుట్రాలం సహా ప్రధాన జలపాతాల్లో వరద దృశ్యాలు నెలకొన్నాయి. పడమటి కనుమల్లో కురిసిన వర్షాల కారణంగా కుట్రాలం తదితర జలపాతాల్లో నీరు ఎగసి పడుతోంది. దీంతో ఆ జలపాతాల్లో పర్యాటకులు స్నానం చేయకుండా కట్టుదిట్టంగా పోలీసులు నిషేధం విధించారు. ప్రస్తుతం శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తులంతా కుట్రాలం జలపాతాల్లో స్నానాలకు వెళుతుంటారు. ప్రస్తుతం కుట్రాలం జలపాతాల వద్ద జలాలు ఉధృతంగా ఎగసిపడుతుండటంతో అయప్పభక్తులు నిరాశతో తిరిగి వెళుతున్నారు.


కుట్రాలం ప్రధాన జలపాతంలో ఎగసిపడుతున్న జలాలు

కార్తిక దీపోత్సవానికి సిద్ధమవుతున్న తిరువణ్ణామలై

వేలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో కార్తిక మాస ఉత్సవాల కోసం శరవేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. డిసెంబరు 3న జరిగే కార్తిక దీపోత్సవ వేడుకలకు ఆలయ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్ ఉత్సవమూర్తులను అలంకరించిన వాహనాల్లో పుర వీధుల్లో ఊరేగించనున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణాల్లోని దుకాణాల్లో మహాదీపోత్సవాన్ని పురస్కరించుకుని మట్టి ప్రమిదల విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి.


ఆలయంలోని కామధేనువు వాహనానికి రంగులు వేస్తున్న దృశ్యం

ఉత్సవాల వివరాలు...

కార్తిక దీపోత్సవం సందర్భంగా అరుణాచలేశ్వరాలయంలో ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున 6 గంటలకు ధ్వజారోహణం, 25న రజత కల్పవృక్షం, కామధేనువు వాహన సేవలు, 26, 27వ తేదీల్లో ప్రత్యేక అలంకార అభిషేకాలు, 28న సాయంత్రం వెండి నందివాహన సేవ, 29న గణపతి, చంద్రశేఖరస్వామివార్లకు వెండి గజవాహనం, 63 నాయనార్లకు పల్లకీ సేవ కార్యక్రమాలు జరుగుతాయి. డిసెంబరు 3వ తేదీ ఉదయం భరణిదీపం, సాయంత్రం 6 గంటలకు మహాదీపం వెలిగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.


నాయనార్లను ఊరేగించే పల్లకీలు

సోలార్ రూఫ్ టాప్‌తో ఎన్నోలాభాలు

- కేంద్ర ఎంఎస్ఎంఈ జాయింట్ డైరెక్టర్ సురేష్ బాబూజీ

ప్యారీస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్ వలన విద్యుత్ బిల్లు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సహకరించనట్లు అవుతుందని కేంద్ర ఎంఎస్ఎంఈ చెన్నై జాయింట్ డైరెక్టర్ సురేష్ బాబూజీ పేర్కొన్నారు. మైలాపూర్‌లోని హోటల్ సవేరాలో ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఏసీసీ) ఆధ్వర్యంలో శనివారం సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. పీఎం సూర్యఘర్ యోజన పథకంలో చిన్న పరిశ్రమల భవనాల పైకప్పులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాలు, దీనిని పొందడానికి సబ్సిడీ, సిస్టమ్ సైజులు, వెండర్ రేటింగ్ తదితర అంశాలపై కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్‌బాబూజీ అవగాహన కల్పించారు. ఎస్ఐడీబీఐ డీజీఎం కేఎస్.చంద్రశేఖర్, సీఏజీ రీసెర్చర్ సుబ్రమణి ముత్తుకుమార్, డాక్టర్ కృష్ణ మోహన్‌రావు, కీర్తివాసన్, సోలార్ సురేష్ తదితరులు రూఫ్ టాప్ సోలార్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కె.వి. సిస్టమ్‌కు రూ.30వేలు, రెండు కె.వి.ల సిస్టమ్‌కు రూ.60వేలు, మూడు కె.వి.లకు రూ.70వేల చొప్పున సబ్సిడీ పొందవచ్చని సిటిజన్ కన్స్యూమర్ అండ్ సివిక్ యాక్షన్ గ్రూప్ (సీఏజీ) రీసెర్చర్ బిక్షుబాకరన్ తెలిపారు. అలాగే సౌర ఫలకాలు చోరీకి గురైనా, ధ్వంసమైన ఇన్సురెన్స్ కింద నష్టపరిహారం పొందవచ్చన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఏసీసీ అధ్యక్షురాలు డా.వీఎల్ ఇందిరా దత్ ఆహ్వాన సందేశాన్ని సెక్రటరీ జనరల్ ఆర్.విజయలక్ష్మి సభకు వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏసీసీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.నరసింహన్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో సురేష్ బాబూజీ, విజయలక్ష్మి తదితరులు

సామాజిక సేవకు జీఆర్టీ రూ.53.7 లక్షల విరాళం



అరుత్పెరుం జ్యోతి అన్నదానం కోసం విరాళం అందజేస్తున్న జీఆర్టీ నిర్వాహకులు

చెన్నై, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నగల బ్రాండ్లలో ఒకటైన జీఆర్టీ సామాజిక సేవా కార్యక్రమాల కోసం భారీగా విరాళం అందించింది. నుంగంబాక్కంలోని చైల్డ్ ట్రస్ట్ హాస్పిటల్‌లో వైద్య పరికరాల కోసం రూ.12 లక్షలు, సేలంలోని ఆర్యవైశ్య చారిటబుల్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌లో విద్యా స్కాలర్‌షిప్‌ల కోసం రూ.10 లక్షలు, వెస్ట్‌మాంబళంలోని పబ్లిక్ హెల్త్ సెంటర్లో నవజాత శిశువులకు ఉచిత టీకా కార్యక్రమాల కోసం రూ.10 లక్షలు, విల్లివాక్కంలోని అరుత్పెరుంజ్యోతి ఆనంద మిషన్‌లో భోజనశాల పరికరాల కోసం రూ.4.5 లక్షలు, కుంభకోణం స్వామినాథ ఆలయలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు సురక్షితంగా దాటడానికి ఉపయోగపడే ఇనుప వంతెన నిర్మాణానికి రూ.17.2 లక్షలు విరాళంగా అందించింది.

కలాం ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం


ట్రస్ట్ అధ్యక్షుడు గోపీకి పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

- రాణిపేట జిల్లా కలెక్టర్ చంద్రకళ

వేలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని రాణిపేట జిల్లా కలెక్టర్ చంద్రకళ కొనియాడారు. రాణిపేట కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఉదయం 'జాతీయ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే' సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ సభ్యులను ఆహ్వానించి కలెక్టర్ ఆధ్వర్యంలో వారికి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చంద్రకళ మాట్లాడుతూ, ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని, సంస్థ మరెన్నో ఉన్నత సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గోపి, కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

యూనిసెఫ్ అధికారుల ప్రత్యేక సమావేశం

వేలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ నేషనల్స్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యూనిసెఫ్) ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఢిల్లీలోని యూనిసెఫ్ అధికారి మహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమలత హాజరై త్వరలో నిర్వహించనున్న టెన్త్, ప్లస్‌టూ విద్యార్థుల పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు తగిన శిక్షణా తరగతులకు సంబంధించి చర్చించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు మాధవన్, మేనేజింగ్ జనరల్ సెక్రటరీ సుబ్రమణి, వేలూరు కార్యదర్శి జనార్ధనన్, జ్యోతీశ్వరి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో యూనిసెఫ్ అధికారులు